క్లుప్తంగా

నేడు పార్టీశ్రేణులతో సమావేశం

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల పార్టీ అధ్యక్షుడితో పాటు మండలంలోని 14 పంచాయతీలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, గృహసారథులు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు, డైరెక్టర్లతో పాటు ముఖ్య నాయకులతో నిర్వహిస్తున్న సమావేశానికి అందరూ విధిగా హాజరుకావాలని కోరారు.

అనంతగిరి: హుకుంపేటలో ఈనెల 12న జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రకు విజయవంతానికి సంబంధించి శుక్రవారం ఉదయం 10గంటలకు హరిత రిసార్ట్స్‌లో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం జరుగుతుందని, పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులంతా పాల్గొవాలని మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి కోరారు.

బస్సు యాత్రను విజయవంతం చేయండి

హుకుంపేట: మండల కేంద్రంలో ఈనెల 12న నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 12న మండల కేంద్రంలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు జి.కొండబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సింహాచలం, వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు శామ్యూల్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామకృష్ణ, పార్టీ గౌరవ అధ్యక్షుడు చినసత్యం, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, నాయకులు చిన్నబ్బి, అనిల్, జైరామ్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా విభాగ సభ్యురాలిగా జానకమ్మ


జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ

దుంబ్రిగుడ: మండలంలోని జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగంలో సభ్యురాలిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఆమె నియామకంపై ఎంపీపీ బాక ఈశ్వరి, వైస్ ఎంపీపీలు ఆనందరావు, లలితతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గోపాల్, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, ఉపాధ్యక్షుడు జగ్గునాయుడు, నాయకులు సింహాచలం, కృష్ణారావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, నేతలు

పాడేరు రూరల్: మండలంలోని గబ్బంగి పంచాయతీ కొత్తాబు గ్రామంలో నిర్మిస్తున్న రోడ్డు పనులకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు స్థానిక నాయకులతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ప్రత్యేక చొరవతో రూ.5కోట్ల నిధులతో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మంగ్లన్నదొర, సర్పంచ్‌లు జి.నీలకంఠం, వి.రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు డి.సన్యాసిరావు, నాయకుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

పాడేరు రూరల్: ఆర్టీసీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ వి.తులసిరామ్ తదితరులు పాడేరు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని తదితర సమస్యలను వినతిలో పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్, నాయకుడు సుందర్‌రావు, తదితరులున్నారు.

ప్రజారోగ్యానికి భరోసా

- పల్లెపల్లెకు ప్రభుత్వ వైద్య సేవలు
- ఆనందంలో గిరిజనం


కూనవరంలో పీహెచ్‌సీని ప్రారంభించిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి(ఫైల్)



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. పేదలు ఎవరూ అనారోగ్య సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టం చేశారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేసి సీహెచ్‌సీ, పీహెచ్‌సీలను అభివృద్ధి చేశారు. గిరిజనులకు కార్పొరేట్ వైద్యం అందుతోంది. దీంతో గిరిజనులు ఇది కదా అభివృద్ధి అని సర్వత్రా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కూనవరం: పల్లె పల్లెకూ వైద్య సేవలు విస్తరించడతో ఏజెన్సీ మండలాల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతుంది. ప్రయివేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ప్రైవేటు ఆస్పత్రులకు ప్రజలు చెక్ పెడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్న ఏళ్ల పాలనలో ప్రభుత్వ ఆస్పత్రుల రూపు రేఖలు మారడంతో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. మండలానికి రెండు పీహెచ్‌సీలు మూలంగా వైద్యం ప్రజలకు మరింత చేరువైంది. గత ప్రభుత్వం వైద్యం పట్ల నిర్లక్ష్యం వహించడంతో విలీన మండలాల్లో ప్రజలు భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం వంటి పట్టణాల్లో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా చితికి పోయేవారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. జగనన్న హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామ గ్రామానికి వైద్య సదుపాయం ఉంది.


ఆస్పత్రికి వచ్చిన రోగులు

నూతన పీహెచ్‌సీ

గతంలో కూటూరు పీహెచ్‌సీ, కోతులగుట్ట సీహెచ్‌సీ ద్వారా మాత్రమే వైద్య సేవలు అందేవి. కేంద్రంలో మరో పీహెచ్‌సీ ఆవశ్యాన్ని గుర్తించిన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌లు ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విలీన మండలాల్లో మెరుగైన వైద్య సేవలపై అప్పటికే దృష్టి పెట్టిన సీఎం జగన్ వెంటనే స్పందిస్తూ కూనవరం పీహెచ్‌సీని మంజూరు చేశారు. దీంతో మండలంలో గోదావరి పరివాహక ప్రాంతంతో పాటు కూనవరం పీహెచ్‌సీ, శబరినది పరివాహక ప్రాంతంలో కూటూరు పీహెచ్‌సీ వైద్య సేవలందిస్తున్నాయి. కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండల వాసులకు కోతులగుట్ట సీహెచ్‌సీలో అత్యవసర వైద్య సదుపాయంతో పాటు అన్ని రకాలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుతున్నాయి.


కోతులగుట్టలో పూర్తిస్థాయి సేవలు అంధిస్తున్న సీ హెచ్‌సీ


కూటూరులో నిర్మిస్తున్న ఆస్పత్రి భవనం

- కూటూరు ఆస్పత్రిలో నాడు–నేడు కింద రూ.1.58కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.
- కూనవరం ఆస్పత్రి నిర్మాణానికి రూ.2.35కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే టెండర్లు పిలిచారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయి.
- కోతులగుట్ట ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలున్నాయి. రోజుకు 180 నుంచి 200 వరకు ఔట్ పేషంట్లు వస్తున్నారు.
- ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది ఉన్నారు. అన్నివేళలా వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.


శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

సేవలివీ

గత టీడీపీ ప్రభుత్వంలో కోతులగుట్ట సీహెచ్‌సీ అలంకార ప్రాయంగా ఉండేది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆరుగురు స్పెషలిస్టులు, ఇద్దరు జనరల్ వైద్యులు సేవలు అందిస్తున్నారు. శస్త్ర చికిత్సలు, కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఎక్స్‌రే, స్కానింగ్, డెంగ్యూ, మలేరియా, ప్లేట్‌లెట్, టైఫాయిడ్, టీబీ, హెచ్‌బిఎస్ఏజీ వంటి 18 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. పౌష్టికాహార లోపంతో ఉన్న పిల్లకు ఎన్ఆర్‌సీయూ కేంద్రం, నవజాతి శిశువు కేంద్రం కూడా ఉంది. ఆయా కేంద్రాల్లో 24 గంటలు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. 11 సచివాలయాల పరిధిలో 10 డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో మిడ్ లవెల్ ప్రోవైదర్లు సేవలు అంధిస్తున్నారు.

మండలం	కూనవరం
జనాభా:	27000
గ్రామాలు	56
పంచాయతీలు	16
సచివాలయాలు	11
పీహెచ్‌సీలు	2
సీహెచ్‌సీ	1
డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు	10
స్పెషలిస్టులు	6
అన్ని విభాగాల వైద్యులు	6

మందులు కొనుక్కునే అవసరం లేదు



నేను గత 18 సంవత్సరాల నుంచి బీపీ, సుగర్ వ్యాధులతో బాధపడుతున్నాను. అందుకు మాత్రలు కొనుగోలుకు చాలా ఇబ్బందులు పడ్డాను. కూనవరంలో పీహెచ్‌సీ ద్వారా నాకు ఉచితంగా మందులు ఇస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందుతుంది.

–యడ్ల చిట్టయ్య, కూనవరం

ఉచితంగా శస్త్రచికిత్స



నేను హెర్నియాతో ఐదారు సంవత్సరాలు బాధపడ్డాను. పొరుగునున్న తెలంగాణ రాష్ట్రం, భద్రాచలం వెళ్ళి ఆపరేషన్ చేయిద్దామనుకుంటే సుమారు రూ. 40 వేలు పైగా ఖర్చు అవుతుందన్నారు. అది నా వల్ల కాదని విరమించుకున్నా. పది రోజుల అనంతరం కూనవరం ప్రభుత్వ ఆస్పత్రి(కోతులగుట్టలో) శస్త్రచికిత్సలు చేస్తున్నారని తెలిసింది. ఇక్కడ ఉచితంగా శస్త్రచికిత్స చేశారు. జగనన్నకు రుణపడి ఉంటాం.

–వేములపల్లి రామారావు, కూనవరం

మెరుగైన వైద్యసేవలు



కోతులగుట్ట సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోజూ 180 నుంచి 200 వరకు ఔట్ పేషంట్లు వస్తున్నారు. ఇటీవల ముగ్గురు స్పెషలిస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. రోగులకు ఉన్నతమైన మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. అన్ని వేళల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

– డాక్టర్ శేఖరెడ్డి, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, కోతులగుట్ట

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు న్యాయం


సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పాడేరులో పల్లె నిద్ర చేస్తున్న సర్పంచ్‌లు


వీరవరంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శిస్తున్న నాయకులు


శరభవరంలో గ్రామస్తులతో పార్టీ నాయకులు


మర్రివాడలో పార్టీ జెండాను ఆవిష్కరణ చేస్తున్న ఎంపీపీ రమేష్ నేతలు


బుక్‌లెట్‌లు పంపిణీ చేస్తున్న నేతలు


చూచిరేవులగూడెంలో బుక్‌లెట్‌ను అందజేస్తున్న నాయకులు


పనసలపాలెంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నేతలు


చినార్కూరులో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించిన నేతలు

పాడేరు రూరల్ : మండలంలోని సుంద్రుపుట్టులో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ్లన్నదొర, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ కోటేశ్వరరావు, సర్పంచ్‌లు రాంబాబు, నీలకంఠం, ఎంపీటీసీ సభ్యులు చిట్టమ్మ, నర్సింహమూర్తి, సన్యాసిరావు, ఏఎంసీ డైరెక్టర్ రామసత్యవతి, నేతలు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మర్రివాడలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, సర్పంచ్ సత్యవతి, మండల పార్టీ అధ్యక్షుడు బాబులు, కన్వీనర్ సుధాకర్, నాయకులు సత్యనారాయణ, చిన్నారావు, నేతలు పాల్గొన్నారు.

వీఆర్ పురం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి బి.సత్యనారాయణ, కార్యదర్శి తాతారావు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ డివిజన్ కమిషన్ సభ్యుడు బాలు, సొసైటీ చైర్మన్ మురళీ, సర్పంచ్ బుచ్చమ్మ, రామారావు, నేతలు పాల్గొన్నారు.

అడ్డతీగల: వీరవరంలో జరిగిన కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మోహన్, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ, సర్పంచ్ వీరవెంకటరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


కూనవరం: చూచిరేవులగూడెం, చినార్కూరు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు విజయ, జేసీఎస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, కన్వీనర్ కోటేశ్వరరావు, సర్పంచ్‌లు నిరోషా, లక్ష్మీ, సొసైటీ అధ్యక్షుడు కొండలరావు, ఉప సర్పంచ్ మంగ, కన్వీనర్లు శ్రీను, కన్నమ్మ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: శరభవరంలో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ రామకృష్ణ, సర్పంచ్ మురళీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

వై.రామవరం: పనసలపాలెం గ్రామ సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ఎం.జోగిరెడ్డి, వి.విశ్వమ్మ, ఎంపీటీసీ వి.సుబ్బలక్ష్మి, సర్పంచ్ నరసింహమూర్తి, నాయకులు కనకరాజు, తిరుపతిరెడ్డి, భారతిబాబు పాల్గొన్నారు.

కొయ్యూరు: గదబపాలెంలో జరిగిన కార్యక్రమంలో డొనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు, పార్టీ జిల్లా సభ్యుడు ఎస్.సూరిబాబు, కన్వీనర్ పి.గాంధీ, నేతలు లక్ష్మీ, రామ్మూర్తి పాల్గొన్నారు.

వివిధ ప్రాంతాల్లో సీఐల బాధ్యతల స్వీకరణ


రమేష్


రామారావు


వెంకటేశ్వరరావు

జి.మాడుగుల: స్థానిక సర్కిల్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఎస్.రమేష్ గురువారం ఇక్కడ పోలీస్ స్టేషన్‌లో పదవీ బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నం సీఐడీ డిపార్టుమెంట్‌లో పనిచేసి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీఐ సత్యనారాయణకు అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్తున్నారు.

ఎటపాక: ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దానేటి రామారావు గురువారం భాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరు రేంజ్‌లో వీఆర్ నుంచి ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఎటపాక సీఐగా పనిచేసిన గజేంద్రకుమార్ వీఆర్‌కి వెళ్లినట్టు సమాచారం. సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తానని సీఐ రామారావు తెలిపారు

రంపచోడవరం: రంపచోడవరం సీఐగా వాసా వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నం ఎస్ఐగా పనిచేస్తూ పదోన్నతిపై రంపచోడవరం సీఐగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కృషి చేస్తామన్నారు. ఇప్పటివరకు సీఐగా పనిచేసిన సురేష్‌బాబు ఏలూరు డీఐజీ కార్యాయలంలో రిపోర్టు చేశారు.

మత్తు పదార్థాలతో అనర్థం

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పలు విషయాలపై సీఐ రమేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని సూచించారు. ఎస్ఐ అరుణ్ కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వైద్య పరీక్షలు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో గురువారం దివ్యాంగులకు వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖకు చెందిన గురుదేవ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 105 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ట్రస్టు అధ్యక్షుడు జగదీష్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు, కుటుంబ సభ్యులకు ఆసరాగా నిలవాలని కోరారు. భాస్కరరావు, ఎంఈవో ప్రసాద్, హెచ్ఎం గోపీనాథ్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' క్రీడలకు కిట్లు పంపిణీ


అనంతగిరిలో కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీడీవో శ్రీహర్షిత్


హుకుంపేటలో క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఎంపీపీ రాజుబాబు

అనంతగిరి: మండల కేంద్రంలోని 21 సచివాలయాలకు ఆడుదాం ఆంధ్రా క్రీడలకు సంబంధించిన కిట్లను ఎంపీపీ శెట్టి నీలవేణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శెట్టినీలవేణి మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలోని సచివాలయం సిబ్బంది సహకారంతో ఆడుదాం ఆంధ్ర క్రీడలను విజయవంతం చెద్దామన్నారు. గిరిజన క్రీడాకారులకు ఇదోక సువర్ణ అవకాశమని, వివిధ క్రీడల్లో ప్రతిభను చూపించేందుకు ఆడుదాం ఆంధ్ర ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. కో–ఆప్షన్ సభ్యుడు మదీనా, ఎంపీడీవో శ్రీహర్షిత్, ఏవో లక్ష్మీనారయణ, సీనియర్ అసిస్టెంట్ రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: యువత క్రీడా రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడి క్రీడా రంగంలో ప్రతిభావంతులు కావాలనే ఉద్దేశ్యంతో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని ఎంపీపీ కూడా రాజుబాబు చెప్పారు. మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా సచివాలయ పరిధిలో ప్రభుత్వం పంపిణీ చేసిన క్రీడా సామగ్రిని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన యువత తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుని పంచాయతీ స్థాయి ఆటల పోటీల్లో పాల్గొవాలని తెలిపారు. ఎంపీడీవో వెంకటరావు, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న సర్పంచ్ ఉషారాణి

సాక్షి, పాడేరు: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించి పాడేరు సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, కామేశ్వరరావు(పాతపట్నం డిగ్రీ కాలేజి లెక్చరర్)దంపతులు రూ.50వేల విరాళాన్ని అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఇతర కమిటీ ప్రతినిధులు సుబ్బారావు, దాము, రాము, సత్యనారాయణవర్మ, నాగేశ్వరరావులకు సర్పంచ్ ఉషారాణి ఈ నగదు రూ.50వేలను గురువారం అందజేశారు.

గురజాడకు ఘన నివాళి

పాడేరు రూరల్ : ప్రముఖ తెలుగు రచయిత గురజాడ అప్పారావు తన రచనాల ద్వారా సాంఘిక పరివర్తకు కృషి చేశారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టాబ్బాయ్ అన్నారు. గురజాడ అప్పారావు వర్ధంతిని కళాశాలలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ టీఎస్ రసూల్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

రాజవొమ్మంగి: బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై మండల కేంద్రంలో డ్వాక్రా సంఘం మహిళలు, వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ న్యూట్రిషియన్ సీసీ నిర్మల మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికలు అనారోగ్యానికి గురవుతారన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలన్నారు.